క్లుప్తంగా

నూతనంగా 421 పెన్షన్ల మంజూరు

అనపర్తి: అధికారంలోకి వచ్చిన తరువాత దశల వారీగా రూ.250 చొప్పున పింఛను మొత్తాన్ని పెంచుతూ రూ.3 వేలు చేస్తానన్న హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడో ఏడాది అమలు చేశారు. దీంతో 2023 నూతన సంవత్సర కానుకగా ఈ నెల నుంచి పింఛన్‌ను రూ. 2,750కు పెంచారు. వైఎస్సార్ పింఛను కానుక పేరుతో ఇప్పటికే మండలంలో 9,750 మందికి పెన్షన్ అందజేస్తున్నారు. ఈ ఏడాది నూతనంగా మరో 421 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరయ్యాయి. దీంతో మొత్తం 10,171 మందికి ప్రభుత్వం పింఛను కానుకను అందజేయనుంది .

సీఎం జగన్ దృష్టికి పౌల్ట్రీ రంగ సమస్యలు



పౌల్ట్రీ రంగ సమస్యలపై సీఎం జగన్‌కు విన్నవిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ముకుందరెడ్డి

అనపర్తి: కొంతకాలంగా పౌల్ట్రీ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసి విన్నవించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులతో మంగళవారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే సమక్షంలో ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కేవీ ముకుందరెడ్డి కలిసి పౌల్ట్రీ రంగ సమస్యలను విన్నవించడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భారీగా అభిషేకాలు



బిక్కవోలులో స్వామి వారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

బిక్కవోలు: మండలంలోని శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం భారీగా అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రం కృత్తిక కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. 412 అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అన్నసమారాధన నిర్వహించినట్లు ఈవో రామలింగ భాస్కర్ తెలిపారు. ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకటసుబ్బారెడ్డి, శ్రీలక్ష్మీ గణపతి ఆలయం కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనువాస్‌రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

టీటీడీ ప్రచార రథం రాక



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సీతానగరం: తిరుమల తిరుపతి దేవస్థానం వారి సనాతన హిందూధర్మ ప్రచార రథం మంగళవారం కూనవరం వచ్చింది. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి రథంలోని స్వామిని దర్శించుకున్నారు. సర్పంచ్ సుంకర గంగాలక్ష్మి, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర నరసింహారావు, ఎం.పిచ్చయ్య, గేదెల సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నల్గొండ గ్రామానికి రథం పయనమైంది. అలాగే బుధవారం రాత్రి సీతానగరంలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి చేరుకుంటుందని, గురువారం ఉదయం నుంచి గ్రామంలో భక్తులకు దర్శనభాగ్యం కలుగుతుందని దేవదాయ, ధర్మదాయశాఖ ఏవో సోమాల శివ, ఆలయ కమిటీ చైర్మన్ సలాది వాసు తెలిపారు.

ఎంపీడీఓగా కృష్ణగోపాల్ బాధ్యతల స్వీకరణ

రంగంపేట: మండల అభివృద్ధి అధికారిగా బలుసు కృష్ణగోపాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణగోపాల్ ఇదే మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనా అధికారిగా పనిచేస్తూ ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన కేఎస్ఎస్ సుబ్బారావు పదోన్నతిపై వెళ్లిపోవడంతో అప్పటి నుంచి ఈయన ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే అక్టోబర్ 28వ తేదీన రోడ్డు ప్రమాదంలో కృష్ణగోపాల్ గాయపడటంతో అప్పటి నుంచి బిక్కవోలు ఎంపీడీఓ జె. ఝాన్సీకి రంగంపేట ఎంపీడీఓ బాధ్యతలు అప్పగించారు. కృష్ణగోపాల్ పూర్తిగా కోలుకోవడంతో జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి కృష్ణగోపాల్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో తిరిగి రంగంపేట ఎంపీడీఓగా నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఆశాజనకంగా జీడిమామిడి

- సస్యరక్షణతో దిగుబడులు
- సాగుకు రైతుల ఆసక్తి



బూరుగుపూడిలో పూత దశకు చేరిన జీడి పంట

మధురపూడి: మెట్ట ప్రాంతమైన రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లోని రైతులకు జీడిమామిడి సాగు ఆసరాగా నిలుస్తోంది. వారికి ఆర్థికంగా చేయూత ఇస్తోంది. జీడిమామిడి తోటలకు సంబంధించి ఎకరం విస్తీర్ణంలో సుమారు 70 నుంచి 80 చెట్లు ఉంటాయి. వీటి నుంచి 500 - 700 కేజీల దిగుబడి లభిస్తోంది. పెట్టుబడిగా ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.15 వేలు ఖర్చవుతుంది. ఎకరం విస్తీర్ణంలో రూ.40 వేల ఆదాయం పొందవచ్చు. రాజానగరం అనపర్తి నియోజకవర్గాల్లో 11,309 ఎకరాల విస్తీర్ణంలో తోటలున్నాయి. కొండ, మెట్ట ప్రాంతాలు అనువుగా ఉండటంతో దీని సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

యాజమాన్య పద్ధతులతో..

జీడిమామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులు అనుసరించడం ద్వారా లాభదాయకంగా ఉంటుంది. దీనిలో భాగంగా దుక్కి దున్నించడం చెట్లకు బలం ఏర్పడుతుంది. అలాగే పెరుగుతున్న పచ్చి మొక్కలు, పనిచేయని చెట్లను తొలగించాలి. వర్షం నీరు చెట్టుకు చేరడానికి చుట్టూ పళ్లాలు తవ్వాలి. చెట్టుపై ఎండిపోయిన కొమ్మలను తొలగించి, గొడుగు ఆకారంలో తయారు చేయాలి. దాని ద్వారా సూర్యకిరణాలు చెట్టుకు చేరతాయి. చీడపీడల నివారణ చర్యలు చేపట్టాలి. వీటివల్ల దిగుబడి పెరుగుతోంది.

తెగుళ్ల నివారణకు..

జీడిమామిడిని తేయకు, టీ దోమ ఆశిస్తాయి. కాండం తొలుచు పురుగులు చేరతాయి. వీటికి నివారణకు చర్యలు చేపట్టాలి. మొదటి దఫా కొత్తగా చిగురువచ్చే దశలో మోనోక్రోటోఫస్ 1.6 ఎంఎల్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రెండోదఫా పూత దశలో క్లోరోఫైరీఫోజ్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 3వ దఫాగా పిందె దశలో ప్రొఫెనోపోజ్ -1 మిల్లీలీటర్ మందును ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తద్వారా దోమను నివారించవచ్చు. కాండం తొలుచు పురుగును ఊస ద్వారా బయటకు తీసి కాల్చేయాలి. ఆ కాండాన్ని వేపనూనెతో స్ప్రే చేయాలి. బోర్డ్ ఆఫ్ పేస్ట్ మిశ్రమంతో రంధ్రాన్ని పూడ్చాలి.

మందుల పిచికారీ



జీడిమామిడిలో డిసెంబర్ నుంచి మార్చి వరకూ అవసరాన్ని బట్టి మందులను పిచికారీ చేయాలి. తేయాకు దోమ నివారణకు 3 దఫాలుగా మందులు స్ప్రేచేయాలి. తామర, ఆకు గూడు, ఇతర రసం పీల్చే పురుగుల నివారణకు మందులు పిచికారీ చేయాలి.

– కె.దివ్య, ఉద్యానవన అధికారి, కోరుకొండ

రైతుకు లాభదాయకం



జీడిమామిడి రైతులకు లాభదాయకంగా ఉంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ పంట సాగు ఎక్కువగా ఉంది. యాజమాన్య పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చు. సాగులో రైతులు శ్రద్ధ కనబర్చాలి.

– కోటా సుబ్రహ్మణ్యం, జీడి వ్యాపారి

దారులన్నీ రాజమహేంద్రవరం వైపే..

సీఎం జగన్ సభకు తరలిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

రాజానగరం: సంక్షేమమే పరమావధిగా ప్రజారంజక పాలన అందిస్తున్న సీఎం జగన్ రాకను స్వాగతిస్తూ గ్రామాల నుంచి రాజమహేంద్రవరం సభకు అభిమానులు తండోపతండాలుగా తరలివెళ్లారు. దీనితో జాతీయ, ఆర్అండ్‌బీ రోడ్లతో పాటు గ్రామీణ రహదారులు సైతం జనసంద్రాలయ్యాయి. సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల నుంచి 425 బస్సులు, కార్లు, బైకులు తదితర వాహనాల్లో సుమారు 52 వేల మంది రాజమహేంద్రవరం సభకు దారి కట్టారు.

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండ, బూరుగుపూడి, దోసకాయలపల్లి, శ్రీరంగపట్నం, గాదరాడ తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రాజమహేంద్రవరం తరలివెళ్లారు. ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోకన్వీనర్ గణేశుల పోసి, మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, వ్యవసాయ సలహామండలి చైర్మన్ క్రొవ్విడి సర్రాజు తదితరులు పయనమయ్యారు.

సీతానగరం: ముగ్గళ్ల నుంచి ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ నాయకులు సాదే చంటిబాబు, బొమ్ముల రాంబాబు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సీఎం జగన్ సభకు తరలివెళ్లారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపు మేరకు మండల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజమహేంద్రవరానికి పయనమయ్యారు.



బస్సును అనపర్తిలో జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, వరుపుల

సీఎం సభకు భారీగా తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

అనపర్తి: వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపుదల, లబ్ధిదారులతో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సభకు నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా బిక్కవోలు, అనపర్తి మండలాల నుంచి సభకు తరలివెళ్లే బస్సులకు స్థానిక కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి వద్ద ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు సుమారు 3,500 మంది ఈ సభకు తరలివెళ్లారు. బస్సులను జెండా ఊపి ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. పింఛను సొమ్మును ప్రతీ ఏటా పెంచుతానని ఎన్నికల ముందు ఇచ్చిన మాట మేరకు సీఎం జగన్ అవ్వాతాతల పింఛను సొమ్మును రూ.2,750కి పెంచారని తెలిపారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వరుపుల సుబ్బారావు, జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, పార్టీ నాయకులు ఎన్‌సీఆర్ మురళి, సత్తి రామకృష్ణారెడ్డి, పోతుల ప్రసాదరెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, సబ్బెళ్ల కృష్ణారెడ్డి, చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



ముగ్గళ్ల నుంచి పయనమవుతున్న ఎంపీపీ జ్యోత్స్న, పార్టీ నాయకులు

బయలుదేరిన నాయకులు


బిక్కవోలు: రాజమహేంద్రవరంలో మంగళవారం ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయడానికి మండలం నుంచి నాయకులు బయలుదేరారు. బిక్కవోలులో జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, ఊలపల్లిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బండారు శివ, పందలపాక సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, కాపవరం సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, నియోజకవర్గ వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల అప్పాజీ, ఎంపీటీసీ కొంకుదురు పివి, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అభిమానులు తరలి వెళ్ళారు.



కొండగుంటూరు నుంచి బయలుదేరుతున్న ప్రజలు



వైఎస్సార్ సీపీ జెండాతో నందరాడ నుంచి..



బూరుగుపూడి నుంచి బయలుదేరిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

సావిత్రీబాయి సేవలు ప్రశంసనీయం



నన్నయ వర్సిటీలో సావిత్రీబాయి చిత్రపటానికి పుష్పంజలి ఘటిస్తున్న వీసీ తదితరులు

రాజానగరం: ప్రతికూల వాతావరణంలోనూ మహిళల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన సావిత్రీబాయి పూలే సేవలు ప్రశంసనీయమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు అన్నారు. సంఘ సంస్కర్త, ఉపాధ్యాయి, రచయిత్రి సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని యూనివర్సిటీలో మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్.ఉదయ్ భాస్కర్, కె.నూకరత్నం, పి.వెంకటేశ్వరరావు, కేవీ స్వామి, పి.విజయ నిర్మల పాల్గొన్నారు.

రంగంపేటలో..

రంగంపేట: సావిత్రిబాయి పూలే జయంతిని మండల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు అపురూప్, మహాలక్ష్మి, నాని, సావిత్రిబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల సహాయ కార్యదర్శి కె.నాని, కమిటీ సభ్యులు మణికంఠ, లక్ష్మీసాయి, పవన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ప్రజా ప్రతినిధులు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామంలో రూ. 25 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గ్రామ ఉప సర్పంచ్ ద్వారంపూడి వీర వెంకటరమారెడ్డి ఎంపీటీసీ తేతలి సుమతో కలసి శంకుస్థాపన చేశారు. గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో రూ.20 లక్షలతో ఎస్సీపేటలో సీసీ రోడ్డు నిర్మాణం, రూ.5 లక్షల మండల పరిషత్ నిధులతో శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ మహిళా నేత కర్రి వరలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు తేతలి జగ్గిరెడ్డి, విస్సాకోటి సుబ్బారావు, మాజీ ఉప సర్పంచ్ తేతలి సూర్య చంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిడి జగ్గిరెడ్డి, పి.జార్జి పాల్గొన్నారు.

నేడు బిక్కవోలు మండల సమావేశం

బిక్కవోలు: మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జేఏ ఝాన్సీ మంగళవారం తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి అధ్యక్షతన జరుగుతుందని చెప్పారు.

మహా అన్న సమారాధన

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో మంగళవారం మహా అన్న సమారాధన నిర్వహించారు. సరిపల్లిపేట వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఈ అన్నసమారధన నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సుమారు 12వేలు మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నట్లు తెలిపారు.

సురేష్‌ది హత్యేనా?

- మృతిపై కొనసాగుతున్న దర్యాప్తు
- రెండు ప్రత్యేక బృందాల ఏర్పాటు

మండపేట: నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా పట్టణంలో చోటుచేసుకున్న యువకుడి అనుమానాస్పద మృతిపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. మృతుని తలపై గాయాలను బట్టి హత్యకు గురై ఉండవచ్చునన్న కోణంలో రెండు ప్రత్యేక బృందాలతో పలు కోణాల్లో దర్యాప్తు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని నాళం వారి వీధిలోని స్టూడియోలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న కొనిజాల సురేష్ (28) శనివారం రాత్రి తన స్నేహితుడైన కారు డ్రైవర్ వీరబాబుతో కలిసి నూతన సంవత్సర వేడుకలకు వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం విదితమే. మృతునికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. మద్యం సేవించిన తర్వాత సురేష్‌ను మోటారు సైకిల్‌పై మెయిన్‌రోడ్డులోని థియేటర్ సమీపంలో దించి వెళ్లిపోయానని వీరబాబు పోలీసులకు చెప్పినట్టు సమాచారం. కాగా సురేష్ తలపై గాయాలను బట్టి హత్యకు గురై ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుని బంధువులు, స్నేహితులు పోలీసుల వద్ద వీరబాబుతో పాటు పలువురిపై అనుమానం వ్యక్తం చేసినట్టు తెలిసింది. తమ పరిశీలనలో తేలిన విషయాలను బట్టి సీసీ టీవీ ఫుటేజీలు, అనుమానితుల కాల్‌డేటా వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నట్టు సమాచారం. కేసు దర్యాప్తులో భాగంగా రామచంద్రపురం డీఎస్పీ బాలచంద్రారెడ్డి మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో మృతుని కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తే మృతిపై స్పష్టత వస్తుందని పోలీసులు అంటున్నారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఎవరిని అరెస్టు చేయలేదని వారు తెలిపారు.

విజయలక్ష్మి ఆరోగ్యంపై సీఎం జగన్ ఆరా



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాతో మాట్లాడుతున్న సీఎం జగన్

సీటీఆర్ఐ: అమ్మ ఆరోగ్యం ఎలా ఉందంటూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో వేదికపై రాజాతో సీఎం ముచ్చటించారు. ఈ సందర్భంగా అమ్మ ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అలాగే రాజానగరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే రాజా ఆయనకు వివరించారు.

రెండు తాటికిళ్లు దగ్ధం

రూ.4.50 లక్షల ఆస్థినష్టం



పెదపూడిలో అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఇళ్లు

పెదపూడి: స్థానిక కావమ్మ చెరువు సమీపంలో అగ్ని ప్రమాదం సంభవించి రెండు తాటికిళ్లు దగ్ధమయ్యాయి. తహసీల్దార్ టి.సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో అమలదాసు మంగ, గాడ దుర్గ అనే రెండు కుటుంబాలు పక్కపక్కనే తాటకిళ్లలో జీవిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు వ్యాపించి రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రెండు మోటార్ సైకిళ్లు, టీవీలు, ఫ్రిజ్, కాలిపోయాయి. బాధిత కుటుంబాన్ని తహసీల్దార్ సుభాష్, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, ఆర్ఐ త్రివేణి, వీఆర్వో సునీత పరామర్శించారు. 20 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు.



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అగ్ని ప్రమాద బాధితులకు రూ.26వేలు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే

పెదపూడి: అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులను మంగళవారం ఎమ్మెల్యే పరామర్శించారు. పార్టీ నాయకులు సమకూర్చిన రూ.26వేలు, సుమారు రూ.10వేలు విలువగల బియ్యం నిత్యావసర సరుకులను రెండు బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా బాధితులకు వర్తించే పథకాలన్నీ వెంటనే అందించడానికి కృషి చేస్తానన్నారు. ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు పాల్గొన్నారు.

హిందూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలి



రంగంపేటలో భజన సమాజ గురువులను సత్కరించిన నిర్వాహకులు

రంగంపేట: భజన పాటల ద్వారా దైవభక్తిని ప్రతి ఒక్కరిలో కలిగించి హిందూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడటంలో భజన సమాజాలు కృషి చేయాలని విఘ్నేశ్వర భజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దువ్వా అచ్చారావు పిలుపునిచ్చారు. స్థానిక అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భజన గురువుల సత్కార సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీదేవి బాల భక్త భజన సమాజ సంఘం గురువు, గ్రామ మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు ప్రసంగించారు. సూర్యనారాయణపురం గ్రామానికి చెందిన ఉప్పలపల్లి పెద వీరభద్రంకు, రంగంపేటకు చెందిన భజన గురువు కొనుజుల వెంకయ్య స్మారక అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. భజన గురువులు మావిరెడ్డి నెహ్రూ, జగతం వీరవెంకట సత్యనారాయణ, ఆలయ అర్చకుడు దేవరబట్ల శిరిడీ సాయి శర్మలను గ్రామ పెద్దలు కంటిపూడి ఆనందరావు, మావిరెడ్డి వీర్రాజు, శ్రీను మాస్టరు సత్కరించారు. స్వర్గీయ పోతుల అబ్బాయి స్మారకార్థం ఏకాహ భజనలు ప్రారంభించామని నిర్వాహకుడు పోతుల వీర సుందరరావు తెలిపారు.

రాముని సన్నిధి.. త్యాగరాజస్వామి పెన్నిధి

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



జ్యోతి వెలిగించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రముఖులు

అనపర్తి: తనను కోరి వచ్చిన లౌకిక సంపదలను విడిచిపెట్టి శ్రీరామచంద్రమూర్తి ఉపాసన చేస్తూ రామ తత్వాన్ని అనుభవించి వాటిని కీర్తనల రూపంలో లోకానికి అందించిన భాగవతోత్తముడు త్యాగరాజస్వామి అని ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. తన అసమాన ప్రతిభతో కర్నాటక సంగీత ప్రపంచంలో నూతన శకాన్ని స్థాపించి, కర్నాటక సంగీత గురు సంప్రదాయాన్ని సుస్థిరం చేసిన త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాలు స్థానిక టీటీడీ కల్యాణ మంటపంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. అనపర్తి శ్రీ శారదా సంగీత కళాసమితి ఆధ్వర్యంలో ఎనిమిది రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలను తొలిరోజు చాగంటి కోటేశ్వరరావుతోపాటు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం చాగంటి 'భక్తి వైభవం'పై ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తూ భక్తుడిని భగవంతుడుకి దగ్గర చేసే మార్గం భక్తి మార్గమని అన్నారు. రామ నామం జపించిన అనుగ్రహంతో శ్రీరామచంద్ర మూర్తి సాక్షాత్కారాన్ని పొందిన త్యాగరాజస్వామి మనస్సు దారి తప్పకుండా, మనిషి ఉత్తమ పథంలో ప్రయాణం చేసేందుకు అవసరమైన తన కీర్తనల ద్వారా మానవాళికి మార్గదర్శనం చేశారని తెలిపారు. 23 సంవత్సరాలుగా శ్రీ శారదా సంగీత కళాసమితి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రముఖ నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, తేతలి రాధాకృష్ణారెడ్డి, అమ్మిరెడ్డి ఆయిల్స్ అధినేత సబ్బెళ్ల అమ్మిరెడ్డి, మారెళ్ల గంగరాజుశర్మ, సత్తి రామారెడ్డి, ఎన్‌సీఆర్ భాస్కర రెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, డాక్టర్ టి.రామగుర్రెడ్డి, సమితి ప్రతినిధులు తమలంపూడి చిన్న ఆదిరెడ్డి, నల్లమిల్లి మురళీమోహనబాలకృష్ణారెడ్డి, నల్లమిల్లి మునీశ్వరరెడ్డి, రఘు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ముగ్గురికి జైలు

కంబాలచెరువు: చాకుతో దాడి చేసిన ఘటనలో ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ ఫస్ట్ అడిషనల్ అసిస్టెంట్ సీనియర్ జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. సుబ్బారావు నగర్‌కు చెందిన దాసరి మీరా సాహెబ్ 2019 జులై 28న జాంపేటలో ఒక ఫంక్షన్‌కు వెళ్లాడు. ఆటోలో వెళ్లిన అతడితో పాత గొడవల నేపథ్యంలో తిరగాటి సత్తిబాబు, తిరగాటి దుర్గ, సిద్ధార్థ నగర్‌కు చెందిన దుప్పాడ రవణమ్మ గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో ఆటో అద్దాలు పగలకొట్టి, చాకుతో మీరా సాహెబ్ మెడపై గాయపర్చారు. అడ్డు వచ్చిన అతడి భార్యపైనా దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నేర నిరూపణ కావడంతో సత్తిబాబుకి ఐదేళ్ల జైలు, రూ.500 జరిమానా, దుర్గ, రవణమ్మకు రెండేళ్ల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసును పీపీ జి.వెంకట రత్నంబాబు వాదించారు. ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు సాక్షులను ప్రవేశ పెట్టారు.

నేడు జాబ్‌మేళా

ధవళేశ్వరం: స్థానిక వివేకానంద ఐటీఐలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఏసీ మాన్యుఫ్యాక్చరింగ్, టైర్ మ్యానుఫ్యాక్చరింగ్, హోండాయ్ మోబీస్, ఎన్‌వీహెచ్, ఇసుజు మోటార్స్, కేఐఎంఎల్, సియోన్ తదితర సంస్థల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 30 ఏళ్ల లోపు వారు అర్హులు. జీతం నెలకు సుమారు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. ఆసక్తి, అర్హత కలిగిన వారు బుధవారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్సులతో ఇంటర్వ్యూకు హాజరుకావాలి.

చికిత్స పొందుతూ వీఆర్‌ఓ మృతి

కాజులూరు: చికిత్స పొందుతూ మండలంలోని కోలంక సచివాలయం-2 కి చెందిన వీఆర్‌ఓ తణుకు సాదుపుల్లయ్య (48) మృతి చెందారు. ఐదు రోజుల క్రితం బీపీ అధికమై సాదుపుల్లయ్య స్పృహ తప్పి పడిపోయారు. కుటుంబ సభ్యులు గమనించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తహసీల్దారు బి. సాయిసత్యనారాయణ, ఆర్ఐ వేగేశ్వర్రావు, రెవిన్యూ సిబ్బంది మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు.